క్లుప్తంగా

ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు



హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక అభయాంజనేయస్వామి దేవస్థానంలో హనుమాన్ జన్మ నక్షత్రం పూర్వభాద్రను పురస్కరించుకుని మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయాన్ని, స్వామివారిని పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు గొట్టిపాళ్ల శ్రీనివాసాచార్యులు, రామానుజాచార్యులు నేతృత్వంలో స్వామివారి పంచలోహ విగ్రహానికి అష్టోత్తర శత కలశాలతో విశేష పూజలు, చెరుకు రసంతో ప్రత్యేక అభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం దాత మానికల గుణవర్షిత రోహన్ నిఖిలేష్ (ముసునూరు) 200 మంది భక్తులకు అన్నదానం చేశారు. దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గాప్రసాద్, ఆలయ పాలకమండలి చైర్మన్ నెరుసు భూషణం, ఈవో కూచిపూడి శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సేవాభావం అలవర్చుకోవాలి



కంకిపాడు: ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలని కంకిపాడు సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సంజయ్ అన్నారు. మాస మహిళా దినోత్సవం సందర్భంగా ప్రొద్దుటూరు గాయత్రీవిహార్ భక్తబృందం మంగళవారం ఆసుపత్రిలో రోగులు, గర్భిణులకు ఆహార పొట్లాలు అందజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది అశోక్, భాను, పోరంకి సమితి కన్వీనర్ కేవీ రంగారావు, ఆధ్యాత్మిక కో ఆర్డినేటర్ డి.మోహనరావు, సేవాదళ్ ప్రతినిధి ప్రభాకరరావు, ఎం.వెంకటేశ్వరరావు, తిరుమల రావు, డి.సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

ముగిసిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర




ఉంగుటూరు: రెండు వారాలుగా మండలంలో కొనసాగుతున్న వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ముగిసింది. నాగవరప్పాడు, ఎలుకపాడు గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ఎంపీడీవో శేషగిరిరావు వివరించారు. అనంతరం సంకల్ప్‌యాత్ర ప్రతిజ్ఞ చేశారు. ఉజ్వల యోజన లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎంపీపీ-2 కొట్నాని చంద్రశేఖరరావు, నాగవరప్పాడు సర్పంచ్ పెద నాగూర్, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళాజాత



రామవరప్పాడు: రూరల్ మండలం రామవరప్పాడులోని సొసైటీ కార్యాలయం ఆవరణలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన కళాజాత ఆకట్టుకుంది. నాబార్డ్ సౌజన్యంతో ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమంలో భాగంగా సహకార కేంద్ర బ్యాంక్ అందిస్తున్న సేవలపై కళాకారులు తమ పాటలు, నాటికల ద్వారా అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ పొదుపు ఖాతా తెరవాలని, ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, కిసాన్ క్రెడిట్ కార్డు, నగదు రహిత లావాదేవీలు, ఏటీఎం రూపే, డెబిట్ కార్డు వాడకంతో కలిగే లాభాలు తదితర అంశాలపై కళాజాత బృందం నిర్వహించిన ప్రచార కార్యక్రమం ఆకట్టుకుంది. బ్రాంచ్ మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉంగుటూరు జెడ్పీ హైస్కూల్‌కు సౌండ్‌సిస్టమ్ బహూకరణ



ఉంగుటూరు: స్థానిక జెడ్పీ హైస్కూల్ 2004-05 బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాఠశాలకు రూ.25 వేల విలువైన సౌండ్ సిస్టమ్ సామగ్రిని మంగళవారం బహూకరించారు. పూర్వ విద్యార్థులు సౌండ్ సిస్టమ్, ఖోఖో పోల్స్, జాతీయ నాయకుల ఫొటోలను హెచ్ఎం సీహెచ్ అనితకు అందజేశారు. పూర్వవిద్యార్థులను పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎస్‌కే ఇస్సాక్, హెచ్ఎం అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎస్‌కే అబ్దుల్లా, విజయ్, రాంబాబు, ప్రసాద్, పృథ్వి, వాసు అలేఖ్య పాల్గొన్నారు.

ప్రగతిపథంలో పల్లె



గొల్లగూడెంలో అందుబాటులోకి వచ్చిన సచివాలయ భవనం



నిర్మాణంలో ఉన్న రైతుభరోసా కేంద్రం

గొల్లగూడెంలో అభివృద్ధి భేష్

- ప్రభుత్వ కార్యాలయాలకు సమకూరుతున్న భవనాలు
- వేగంగా మౌలిక వసతుల ఏర్పాటు

కంకిపాడు: మండలంలోని గొల్లగూడెం మైనర్ పంచాయతీ. ఇది ప్రగతిపథంలో నడుస్తోంది. ఇక్కడ సుమారు 1700 మంది జనాభా, 110 మంది ఓటర్లు ఉన్నారు. గత ప్రభుత్వాలు ఈ గ్రామాన్ని నిర్లక్ష్యం చేస్తే వైఎస్సార్ సీపీ హయాంలో ప్రజలకు కావాల్సిన వసతులు చకచకా అమరుతున్నాయి. స్థానిక పాలకవర్గం అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడంతో గ్రామ ముఖచిత్రం కొత్త రూపును సంతరించుకుంటోంది.

ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు

గొల్లగూడెం గ్రామ పంచాయతీ పునాదిపాడు సచివాలయం-2 పరిధిలో ఉంది. సచివాలయం ద్వారా మెరుగైన సేవలు ప్రజలకు అందుబాటులోకి తేవడానికి ప్రభుత్వం సచివాలయం ఏర్పాటుచేసింది. రూ.40 లక్షల అంచనాతో సచివాలయ భవనం నిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చింది. రూ.21 లక్షల అంచనాతో రైతుభరోసా కేంద్రం నిర్మిస్తున్నారు. వీటి పనులు శరవేగంగా సాగుతున్నాయి. వీటితో పాటుగా హెల్త్, వెల్‌నెస్ సెంటరు, అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.23 లక్షలు నిధులు మంజూరయ్యాయి.



రూ.15 లక్షలతో నిర్మించిన డొంక రోడ్డు



నిర్మించిన సిమెంటు రోడ్డు

అన్ని ప్రాంతాల్లో వసతుల కల్పన

గ్రామంలో మురుగునీటి వ్యవస్థను మెరుగుపరచడానికి రూ. లక్ష అంచనాతో డ్రెయిన్ నిర్మాణం పూర్తి చేశారు. గుడివాడ-కోలవెన్ను రోడ్డును కలిపే డొంక రోడ్డు ఏళ్ల తరబడి అభివృద్ధి జరగలేదు. ఎమ్మెల్యే పార్థసారథి చొరవతో డొంక రోడ్డును పూర్తి స్థాయిలో తారురోడ్డుగా అభివృద్ధి చేయడానికి రూ.15 లక్షల నిధులు కేటాయించారు. వీటితో రోడ్డు అభివృద్ధి జరిగింది. జెడ్పీ నిధులు రూ.5 లక్షలతో శ్మశానవాటిక మెరక పనులు పూర్తి చేశారు. గ్రామంలో వివిధ ప్రాంతాల్లో రూ.25 లక్షల అంచనాతో ఐదు రహదారులను సిమెంటు రోడ్లుగా అభివృద్ధి చేశారు. 46 మంది పేదలను ఎంపిక చేసి వారికి ప్రభుత్వం నివేశన స్థలాలను కేటాయించింది. జగనన్న లే అవుట్‌లో రహదారుల నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు కేటాయించారు. గ్రంథాలయం, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. వసతుల కల్పన వేగంగా సాగుతుండటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి



గ్రామంలో అభివృద్ధి పనులు ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నాం. దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను తొలి ప్రాధాన్యంగా అభివృద్ధి చేసి పరిష్కరిస్తున్నాం. ప్రభుత్వం, ఎమ్మెల్యే పార్థసారథి చొరవతో గ్రామంలో అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన జరుగుతున్నాయి. అభివృద్ధే లక్ష్యంగా పాలకవర్గం పని చేస్తోంది.

–నత్తా దుర్గాభవాని, సర్పంచ్, గొల్లగూడెం

పేదల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట

గన్నవరం: పేదల అభ్యున్నతికి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి కె.భక్తపాల్ పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పోలిమెట్ల జయరాజు నేతృత్వంలో గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాలకు చెందిన మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం భక్తపాల్ మాట్లాడుతూ క్రిస్టియన్, మైనార్టీలకు గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదరికం నుంచి బయటపడుతున్నారని చెప్పారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన నాయకులు పార్టీ బలోపేతానికి పాటుపడాలని కోరారు. క్రిస్టియన్, మైనార్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జి కె.జె.విక్టర్‌పాల్ మాట్లాడుతూ త్వరలో క్రిస్టియన్, మైనార్టీ సెల్ ఆధ్వర్యాన అన్ని నియోజకవర్గాల్లో పాదయాత్రలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రైస్తవులు, మైనార్టీలకు ప్రభుత్వం చేసిన లబ్ధిని వివరించనున్నట్లు చెప్పారు. విజయవాడ రూరల్, గన్నవరం జెడ్పీటీసీ సభ్యులు కాకర్లమూడి సువర్ణరాజు, అన్నవరపు విక్టర్‌బాబు, బాపులపాడు మండల పార్టీ అధ్యక్షుడు నక్కా గాంధీ, కన్వీనర్ అవిర్నేని శేషగిరిరావు, ఎంపీపీ నగేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేసిన నూతన కార్యవర్గం

విద్య, ఉపాధిలో విప్లవాత్మక సంస్కరణలు

డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ

కంకిపాడు: విద్య, ఉపాధి రంగాలను ప్రజలకు చేరువ చేయడానికి ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలు తీసుకొస్తోందని డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ అన్నారు. మండలంలోని ఈడుపుగల్లులో ప్రభుత్వ బాలుర వసతి గృహానికి ఆరు ఫ్యాన్‌లు, ట్యూబ్‌లైట్ సెట్లను మంగళవారం వితరణగా అందించారు. అక్కడ వసతి పొందుతున్న కళాశాల విద్యార్థులతో ముచ్చటించారు. విద్యా ప్రమాణాల మెరుగునకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. స్నిగ్ధ మాట్లాడుతూ గత టీడీపీ సర్కారు విద్యను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు ప్రగతి లేక, వసతుల కరువై విద్యార్థులు చదవడానికి ఆస్కారం లేక ఇబ్బందులు పడ్డారన్నారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వం కార్పొరేట్‌కు ధీటుగా విద్యా సంస్థలను తీర్చిదిద్దుతోందని తెలిపారు. విద్యలో తీసుకొచ్చిన సంస్కరణలతో అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులు రాణించేలా బోధన సాగుతోందన్నారు. విద్యార్థులు వసతులు, అవకాశాలను వినియోగించుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వసతి గృహ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ఈడుపుగల్లు ప్రభుత్వ వసతి గృహంలో ఫ్యాన్‌లు, ట్యూబ్‌లైట్లు వితరణ చేస్తున్న పడమట స్నిగ్ధ

ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు

రామవరప్పాడు: రూరల్ మండలం ఎనికేపాడు తాతాపురం మండల పరిషత్ పాఠశాలలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులు విచిత్ర వేషధారణలతో ఆకట్టుకున్నారు. పలువురు విద్యార్థులు క్రీస్తు గేయాలు, నృత్యాలు ప్రదర్శించారు. ముఖ్యఅతిథి మండల విద్యాశాఖాధికారి ఆదూరి వెంకటరత్నం సెమీక్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ క్రీస్తు బోధనలు అనుసరణీయమన్నారు. ఇతరులపై ప్రేమ, దయ, సేవా గుణాలు కలిగి ఉండాలనే క్రీస్తు సందేశాలను పాటించాలన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు సద్గుణాలు అలవర్చుకుని తమ భవిష్యత్‌ను బంగారుమయం చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సత్యవాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న విద్యార్థుల నృత్యం

అంతర్జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ

పామర్రు: అంతర్జాతీయ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ చూపిన స్థానిక ఏఎస్ఎం హైస్కూల్ విద్యార్థులను మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ఏఎస్ఎం ప్రిన్సిపాల్ ఎ.పూర్ణచంద్రారెడ్డి మాట్లాడుతూ ఈనెల 17వ తేదీన గుంటూరు జిల్లా అమరావతిలో జరిగిన అంతర్జాతీయ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో విశేష మైన ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారన్నారు. వి.హర్షిత్, ఎ.అస్మిత్ ప్రథమ స్థానంలో రాణించారన్నారు. ఆరు రజత పతకాలను, నాలుగు కాంస్య పతకాలను సాధించారని తెలిపారు. అనంతరం విజేతలైన విద్యార్థులను, కోచ్ వీవీ రామకృష్ణను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పతకాలు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

అమ్మవారి చీరల బహిరంగ వేలం

పెనమలూరు: యనమలకుదురులోని శ్రీకనకదుర్గ లయంలో అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలను బహిరంగ వేలం వేయనున్నామని కార్యనిర్వహణాధికారి యు.ప్రసాదరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు ఈ నెల 27, 28 తేదీల్లో ఆలయ ప్రాంగణంలో ఉదయం 11 గంటలకు భక్తుల సమక్షంలో వేలం వేస్తామని, మరిన్ని వివరాలకు ఆలయంలో సంప్రదించాలని సూచించారు.

పేకాట శిబిరంపై దాడి

కంకిపాడు: పేకాట శిబిరంపై పోలీసులు మంగళవారం దాడులు చేశారు. ఎస్ఐ కె.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం కంకిపాడులోని ఎస్సీ కాలనీలో పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందటంతో ఆ ప్రాంతంపై దాడులు జరిగాయి. ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2,130 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం

పెనమలూరు: తాడిగడప గ్రామంలో డిగ్రీ విద్యార్థిని అదృశ్యం కావడంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప కార్మికనగర్‌కు దంపతులు, ఇద్దరు కుమార్తెలతో నివసిస్తున్నారు. వారి రెండో కుమార్తె (19) విజయవాడలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈ నెల 18వ తేదీ కాలేజీకి వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాలేదు. ఆమె కోసం వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఘనంగా చిన్నయసూరి జయంతి

గుడివాడ టౌన్: తెలుగు భాష అభివృద్ధికి చిన్నయసూరి రూపొందించిన బాలవ్యాకరణం గట్టి పునాది వేస్తుందని గుడివాడ తహసీల్దార్ కె.ఆంజనేయులు అన్నారు. మంగళవారం స్థానిక షా గులాబ్ చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో పరవస్తు చిన్నయసూరి జయంతి ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ తెలుగు భాష అభివృద్ధిలో అనేకమంది శ్రమదాగి ఉందన్నారు. అందులో చిన్నయసూరి ప్రముఖులన్నారు. ఈ సందర్భంగా విద్యావేత్త ఇరుక్కోవల్లూరి వెంకట రమణకు చిన్నయసూరి పురస్కారాన్ని అందజేశారు.

నున్నలో మైక్రోఫిల్టర్ బెడ్స్ పరిశీలన



నున్న(విజయవాడరూరల్): నున్నలో ఏర్పాటు చేసిన మైక్రోఫిల్టర్ బెడ్స్ త్వరలో ప్రారంభం కానుంది. గ్రామ ప్రజలకు శుద్ధి చేసిన తాగునీటిని సరఫరా చేయడానికి జలజీవన్ మిషన్ రూ.20 లక్షలతో మైక్రోఫిల్టర్స్ బెడ్‌ను ఏర్పాటు చేశారు. దీన్ని ఈఈ జేఎల్వీ ప్రసాద్, ఏఈ శ్వేత, సర్పంచి కాటూరి సరళశ్రీనివాస్, ఉప సర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, సచివాలయ ఇంజినీర్ బంగారురాజు, మైక్రోఫిల్టర్స్ కంపెనీ ప్రతినిధి నాని, వైఎస్సార్ సీపీ బొంతు సాంబిరెడ్డి, షేక్ హుస్సేన్ సోమవారం పరిశీలించారు. మైక్రోఫిల్టర్స్ బెడ్ పనిచేసే విధానాన్ని కంపెనీ ప్రతినిధి నాని ట్రయల్‌రన్ చేసి చూపించారు. రోజూ 10 లక్షల లీటర్ల నీటి ఉత్పత్తి చేసే యూనిట్‌ను ప్రతి మూడు గంటలకు ఒకసారి శుభ్రం చేసుకోవాలని, అలా చేస్తే దీని లైఫ్ సామర్థ్యం పెరుగుతుందన్నారు. నున్నలో రోజుకు మూడు లక్షల లీటర్ల తాగునీరు అవసరం ఉంటుందని సర్పంచి సరళ అధికారులకు తెలియచేశారు. దీన్ని త్వరలో ప్రారంభించి తాగునీరు సరఫరా చేయనున్నట్లు చెప్పారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సంక్షేమ బోర్డు క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



కొండపావులూరులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించిన దృశ్యం

రామవరప్పాడు: రాష్ట్ర ప్రజల సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీటీసీ సభ్యుడు సువర్ణరాజు అన్నారు. విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు సచివాలయం-2లో మంగళవారం 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ బోర్డు క్యాలెండర్‌ను వైఎస్సార్ సీపీ నాయకులు ఆవిష్కరించారు. సువర్ణరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని చెప్పారు. గ్రామంలోని సచివాలయం-2 పరిధిలో నాలుగున్నరేళ్లలో సుమారు రూ.34.59 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శీలం రంగారావు మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి జరిగిందని, లబ్ధిదారులకు నేరుగా కోట్ల రూపాయలను పథకాల రూపంలో అందించారని చెప్పారు. సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో ఉంచిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్.వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ దూరు రత్నం, వార్డు సభ్యులు పిన్నిబోయిన రవికుమార్, పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

కొండపావులూరులో..

గన్నవరంరూరల్: కొండపావులూరు గ్రామంలో మంగళవారం వై ఏపీ నీడ్ జగన్ కార్యక్రమం జరిగింది. సర్పంచ్ ఉప్పుగంటి పద్మజ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలిపిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలవాలని చెప్పారు. గత ప్రభుత్వంలో పార్టీ, కులం, వర్గం ప్రాతిపదికగా పథకాలను ఇచ్చేవారన్నారు. ఈ ప్రభుత్వంలో అందరికీ పథకాలు అందజేస్తున్నారన్నారు. ఈవోపీఆర్డీ వెంకటేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనువణేష్, సహకార బ్యాంకు చైర్‌పర్సన్ కంచర్ల నాగబాబు, సచివాలయం కార్యదర్శి ఎం.జోసఫ్ తంబి, సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. గ్రామస్తులకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల బోర్డును నాయకులు, అధికారులు ఆవిష్కరించారు.



బొమ్ములూరులో ..

హనుమాన్‌జంక్షన్‌రూరల్: పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ అన్నారు. బొమ్ములూరులోని గ్రామ సచివాలయం ప్రాంగణంలో 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. తొలుత గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డును, గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండాను యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు యర్రంశెట్టి వెంకట రామాంజనేయులుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం సమావేశం జరిగింది. బొమ్ములూరులో గడిచిన నాలుగున్నర ఏళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ప్రత్యక్ష నగదు బదిలీ, నాన్ డీబీటీ ద్వారా లబ్ధిదారులకు రూ. 32.33 కోట్లు మేర నగదు పంపిణీ జరిగిందని వివరించారు. అనంతరం గ్రామంలోని ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజాప్రతినిధులు వివరించారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జి ఆవిర్నేని శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, ఎంపీటీసీ సభ్యురాలు కుందేటి శిరీష తదితరులు పాల్గొన్నారు.

మెషిన్ లెర్నింగ్‌తో కచ్చితమైన ఫలితాలు

ప్రొఫెసర్ మంచిరాజు

పెనమలూరు: మెషిన్‌లెర్నింగ్‌తో కచ్చితమైన ఫలితాలు సాధించవచ్చని యూఎస్ మిచిగాన్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మంచిరాజు చంద్రశేఖర్ అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో మంగళవారం మెషిన్ లెర్నింగ్ మోడల్స్, అప్లికేషన్స్‌పై శిక్షణ జరిగింది. ఆయన మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో భాగమైన మెషిన్ లెర్నింగ్ అనేది డేటా నుంచి సిస్టమ్, నమూనాలు రూపొందించడంలో మానవ ప్రమేయం లేకుండా సాయపడుతుందన్నారు. దీంతో కచ్చితమైన ఫలితాలు తక్కువ సమయంలో ప్రాజెక్టులు చేయటంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. సీనియర్ అప్లయిడ్ శాస్త్రవేత్త పీవీ మేఘన మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులు దృష్టి పెట్టాలని సూచించారు. ప్రత్యేకంగా ప్రాజెక్టులు రూపొందించడంలో విద్యార్థులు నైపుణ్యం సాధించాలన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్.. శిక్షణ ఇచ్చిన రిసోర్స్‌పర్సన్లను సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్కూరు పీఎస్‌లో డీఎస్పీ తనిఖీ

ఉంగుటూరు: మండలంలోని ఆత్కూరు పోలీస్‌స్టేషన్‌లో గత ఏడాదితో పోలిస్తే రోడ్డు ప్రమాదాలు, నేరాలు, దొంగతనాలు తగ్గాయని గన్నవరం డీఎస్పీ ఆర్జీ జయసూర్య తెలిపారు. ఆత్కూరు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన వార్షిక తనిఖీ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన పలు రికార్డులు పరిశీలించారు. పెండింగ్‌కు కేసులపై పలు సూచనలు చేశారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ గతేడాదితో పోలిస్తే స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు, నేరాలు తగ్గడంతో పాటు సొమ్ము రికవరీ శాతం పెరిగిందని చెప్పారు.

ఈ ఏడాది మొత్తం 274 కేసులు నమోదయ్యాయని, 2022తో పోల్చితే నేరాలు తగ్గాయని చెప్పారు. రాబోయేది ఎన్నికలు రోజులని గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాలు పెరిగాయని, ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ లావాదేవీలు నిర్వహించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తమ వ్యక్తిగత బ్యాంకు సమాచారాన్ని అపరిచితులకు తెలియజేయకూడదని చెప్పారు. కార్యక్రమంలో హనుమాన్ జంక్షన్ సీఐ అల్లు నవీన్ నరసింహమూర్తి, ఆత్కూరు ఎస్ఐ టి.సూర్యశ్రీనివాస్ పాల్గొన్నారు.



ఆత్కూరు స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ జయసూర్య

ఆట స్థలాల పరిశీలన

పెనమలూరు: ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీల నిర్వహణ కోసం మంగళవారం అధికారులు మండల పరిధిలోని ఆట స్థలాలను పరిశీలించారు. ఎంపీడీఓ సునీతాశర్మ వివరాలు తెలుపుతూ గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో అన్ని సచివాలయాలకు సంబధించి క్రికెట్ పోటీలు నిర్వహిస్తామన్నారు. పెనమలూరు జెడ్పీ పాఠశాల, గంగూరు నలంద పాఠశాల, చోడవరం, పెదపులిపాక, వణుకూరు పాఠశాలల్లో ఆటల పోటీలు నిర్వహిస్తామన్నారు. సచివాలయాల వారీగా పోటీలు ఎక్కడ నిర్వహించేది ప్రకటిస్తామన్నారు. ఎంపికైన టీమ్‌లకు మండల, నియోజకవర్గ స్థాయిలో కూడా పోటీలు ఉంటాయని తెలిపారు. ఆడుదాం ఆంధ్రాలో ఖోఖో, క్రికెట్, వాలీబాల్, బాడ్మింటన్, కబడ్డీ పోటీలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, ఎంఈఓ శేషగిరిరావు, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.



గంగూరులో ధనేకుల కాలేజీలో ఆటస్థలం పరిశీలిస్తున్న ఎంపీడీఓ సునీతాశర్మ